## తెలంగాణ హైకోర్టు సీజే అలోక్ అరాధే బదిలీ

- బాంబే హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్
- సుప్రీంకోర్టు జడ్జీగా వినోద్ చంద్రన్
- కేంద్రానికి కొలీజియం సిఫారసులు



జస్టిస్ అరాధే



జస్టిస్ వినోద్

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ అలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. ఆయన బదిలీపై వెళ్లిన తర్వాత జస్టిస్ సుజయ్ పాల్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తారు. మరో వైపు, పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కే వినోద్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సమావేశమైంది. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించడంతో ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ విభూ బఖ్రూ ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. గౌహతి హైకోర్టు అదనపు న్యాయమూర్తులు జస్టిస్ కర్దక్ ఈటే, జస్టిస్ మృదుల్ కుమార్ కలితాను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కూడా కొలీజియం సిఫారసు చేసింది. 2011 నవంబర్ 8న కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ చంద్రన్ పేరును సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొలీజియం సిఫారసు చేసింది. ఈ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33కి పెరుగుతుంది. సుప్రీంకోర్టుకు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 34. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవి కుమార్ ఈ నెల 3న పదవీ విరమణ చేశారు.

## 26న దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు

### ప్రకటించిన రైతు సంఘాలు

న్యూఢిల్లీ: డిమాండ్ల సాధనకు చేస్తున్న ఆందోళనల్లో భాగంగా ఈ నెల 26న రిపబ్లిక్ డే నాడు దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించనున్నట్టు రైతు సంఘాలు ప్రకటించాయి. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లతో రైతు నేత డల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఆమరణ దీక్ష చేస్తున్న క్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా నేతలు పంజాబ్-హర్యానా సరిహద్దు వద్ద జరిపిన ధర్నాలో ఈ ప్రకటన చేశారు. కాగా, వ్యవసాయ రంగంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద సంస్కరణలను తిరస్కరిస్తూ ఢిల్లీలోని ఎర్రకోట వద్ద వేలాది ది రైతులతో 2021లో నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీ హింసాత్మకంగా మారింది.

## కమిషనర్లు లేకపోతే ఆర్టీఐతో ఏం ప్రయోజనం?

### తెలంగాణ సహా 3 రాష్ట్రాలు, కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: కేంద్రం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్టీఐ కమిషనర్లను నియమించడంలో తీవ్ర జాప్యం చేయడంపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆయా పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించింది. 'వీటిని త్వరగా భర్తీ చేయకపోతే ఈ సంస్థలు ఉండి ఏం ప్రయోజనం? కేవలం బ్యూరోక్రాట్లనే కమిషనర్లుగా నియమిస్తున్నారు. ఇతర రంగాల నిపుణులను ఎందుకు నియమించరు? మేం దీని గురించి మరింత మాట్లాడదలచుకోలేదు' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పిటిషనర్ అంజలీ భరద్వాజ్ తరపున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ సమాచార కమిషన్లలో ఖాళీల భర్తీపై 2019లోనే సుప్రీంకోర్టు సమగ్ర ఆదేశాలిచ్చినా అవి అమలు కావడం లేదన్నారు. కోర్టు స్పందిస్తూ రెండు వారాల్లోగా కమిషనర్ల ఎంపిక కోసం జాబితా సిద్ధం చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. కమిషనర్లు లేక తెలంగాణ, త్రిపుర, జార్ఖండ్ సమాచార కమిషన్లు నిరుపయోగంగా మారాయని ధర్మాసనం మండిపడింది.

## ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

- 8వ తేదీన ఫలితాల ప్రకటన
- షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ, జనవరి 7: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఈ నెల 10వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 17వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. 18న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. 20వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగుతుంది. 8న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి. ఢిల్లీ అసెంబ్లీలోని 70 స్థానాలతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్, తమిళనాడులోని ఈరోడ్(ఈస్ట్) అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు సైతం ఇదే షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి. అసెంబ్లీ షెడ్యూల్ విడుదల కావడంతో ఢిల్లీలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కాగా, ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాల్లో 58 జనరల్ స్థానాలు, మరో 12 రిజర్వ్‌డ్ స్థానాలు. ఇక్కడ మొత్తం 1.55 కోట్ల ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కోసం 13 వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

**ఈవీఎంలపై ఆరోపణలు నిరాధారం: సీఈసీ**

ఈవీఎంలలో చెల్లని ఓట్లకు, రిగ్గింగ్, ట్యాంపరింగ్‌కు అవకాశమే ఉండదని, ఇదే విషయాన్ని హైకోర్టులు, సుప్రీంకోర్టులు 42 సార్లు స్పష్టం చేశాయని రాజీవ్ కుమార్ తెలిపారు. ఇప్పటికి 67 వేల వీవీప్యాట్లలోని 4.5 కోట్ల స్లిప్పులను లెక్కించగా, ఒక్క ఓటు కూడా తేడా రాలేదని అన్నారు. కాగా, ఢిల్లీలో ఓట్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా తప్పని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో త్వరలో ఓటర్ల సంఖ్య వంద కోట్లు దాటి కొత్త రికార్డును సృష్టించబోతున్నదని రాజీవ్ కుమార్ తెలిపారు.



**రిటైర్‌మెంట్ తర్వాత హిమాలయాలకు..**

సీఈసీ రాజీవ్ కుమార్ ఫిబ్రవరి 18న రిటైర్ కానున్నారు. రిటైర్‌మెంట్ తర్వాత తాను నాలుగైదు నెలల పాటు హిమాలయాల్లో గడుపుతానని ఆయన చెప్పారు. హిమాలయాల్లో ఏకాంతంగా ఉంటానని, తనను తాను చదువుకుంటానని ఆయన పేర్కొన్నారు. తాను చెట్టు కింద చదువుకున్నానని, తనలాంటి పిల్లలకు చదువు చెప్తానని తెలిపారు.

# రాజధానిలో రసవత్తర పోరు

- హ్యాట్రిక్ విజయంపై ఆప్ కన్ను
- పథకాలే గట్టెక్కిస్తాయని ఆశలు
- ఆప్ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకే బీజేపీ ప్రయత్నాలు
- పాతికేండ్ల తర్వాత అధికార పీఠంపై కమలం కన్ను
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ పార్టీ తహతహ



న్యూఢిల్లీ, జనవరి 7: దేశ రాజధాని ఢిల్లీలో అసలైన ఎన్నికల ఫీవర్ మొదలైంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గడ్డకట్టే చలిలోనూ రాజకీయ వాతావరణం సెగలు పుట్టిస్తున్నది. మరోసారి ఢిల్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని దక్కించుకునేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీలో పునరావృతం చేసి, 25 ఏండ్ల తర్వాత హస్తినను కైవసం చేసుకోవాలని బీజేపీ శ్రమిస్తున్నది. ప క్రితం కోల్పోయిన ప్రభను మళ్లీ తిరిగి తెచ్చుకునేందుకు హస్తం పార్టీ సైతం కష్టపడుతున్నది. 70 స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో ప్రధానంగా ఆప్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. కాంగ్రెస్ సైతం మంచి ఫలితాలను సాధించి, కింగ్‌మేకర్ అవ్వాలని ప్రయత్నిస్తున్నది.

**ఆమ్ ఆద్మీ పార్టీ భవిష్యత్తుకు కీలక ఎన్నిక**

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ ఎన్నికలు కఠిన పరీక్షగా మారాయి. 2015, 2020 ఎన్నికల్లో 70 స్థానాలకు 67, 62 స్థానాలను గెలిచి అసాధారణ ఫలితాలను అందుకున్న ఆప్ ఈసారి మాత్రం అవినీతి ఆరోపణలు, నేతల అరెస్టులు, వలసలతో గడ్డు పరిస్థితుల్లో ఎన్నికలను ఎదుర్కొంటున్నది.

**బలాలు**

- స్లమ్‌లు, అనధికార కాలనీలు, మైనారిటీలు మెజారిటీగా ఉన్న, పేద వర్గాలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ఆమ్ ఆద్మీకి గట్టి పట్టుంది.
- కొందరు నేతలు వలస వెళ్లినా పార్టీకి బలమైన క్యాడర్ ఉంది.
- ముస్లిం, సిక్కు, దళిత, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఓటుబ్యాంకు ఆప్ బలం.

**బలహీనతలు**

- హోరాహోరీ పోరు ఉండటంతో కాంగ్రెస్ పార్టీ చీల్చే ఓట్లు ఆప్‌ను దెబ్బతీయొచ్చు.
- అవినీతి ఆరోపణలు, పదేండ్ల పాలనపై సహజంగా ఉండే వ్యతిరేకత, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత నష్టం చేయవచ్చు.
- పలువురు కీలక నాయకులు రాజకీయంగా చురుగ్గా లేకపోవడం, ఇంకొందరు బీజేపీలో చేరడం మైనస్.

**'మార్పు' నినాదంపై బీజేపీ ఆశలు**

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ చేతిలో బీజేపీ గట్టి ఎదురుదెబ్బ తిన్నది. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఢిల్లీలోని మొత్తం 7 ఎంపీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రభావం చూపలేకపోతున్నది. రాజధానిలో తమకు కంట్లో నలుసుగా మారిన ఆప్‌ను ఈసారి ఓడించాలని గట్టి పట్టుదలతో బీజేపీ ఉంది. 'పరివర్తన్(మార్పు)' నినాదంతో బీజేపీ ఈ ఎన్నికలకు వెళ్తున్నది.

**బలాలు**

- కేజ్రీవాల్, ఆప్ నేతలపై అవినీతి ఆరోపణలు, విలాసవంతంగా సీఎం అధికారిక నివాసం నిర్మించారనే విమర్శలు బీజేపీకి కలిసిరావొచ్చు.
- ఆప్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు బీజేపీకి ఓట్లను పెంచొచ్చు.
- గత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఏడు స్థానాలను గెలవడం, 70 అసెంబ్లీ స్థానాల్లో 52లో మెజారిటీ రావడం బీజేపీ క్యాడర్‌కు జోష్ ఇచ్చింది.

**బలహీనతలు**

- కేజ్రీవాల్‌తో సీఎం అభ్యర్థిగా సరితూగే నాయకుడు కనిపించడం లేదు.
- ఆప్ సంక్షేమ పథకాలకు పోటీగా పథకాలను ప్రకటించలేదు. ఆప్ పథకాలు కొనసాగిస్తామని మాత్రమే చెప్తున్నది.
- 12 రిజర్వ్‌డ్ స్థానాలు, మైనారిటీలు అధికంగా ఉన్న 8 స్థానాల్లో 2015, 2020లో ఒక్కటంటే ఒక్క సీటు కూడా బీజేపీ గెలుచుకోలేకపోయింది. ఈ 20 స్థానాల్లో బీజేపీకి ప్రతికూలత కనిపిస్తున్నది.

**పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం**

పదేండ్ల క్రితం వరకు ఢిల్లీలో 15 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గత రెండు అసెంబ్లీ ఎన్నికలు, మూడు పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలో ఒక్కటంటే ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేదు. ఈసారి ఎలాగైనా హస్తినలో పూర్వవైభవం సాధించాలని హస్తం పార్టీ గట్టిగానే ప్రయత్నిస్తున్నది.

**బలాలు**

- షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్, ఢిల్లీ పీసీసీ చీఫ్ దేవేందర్ యాదవ్, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా వంటి ప్రముఖ నేతలను బరిలోకి దింపడంతో కొన్ని స్థానాల్లో బలమైన పోటీ ఇస్తున్నది.
- ఆప్ పదేండ్ల పాలనపై వ్యతిరేకత కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తున్నది.
- అధికంగా ఉన్న మైనారిటీ ఓటర్లు, త్రిముఖ పోరులో లాభపడతామనే అంచనాలతో ఉంది.

**బలహీనతలు**

- షీలా దీక్షిత్ మరణం తర్వాత కాంగ్రెస్‌లో నాయకత్వలేమి ఉంది.
- వరుసగా అన్ని ఎన్నికల్లో దారుణ ఓటమితో పార్టీ క్యాడర్ నైరాశ్యంలో ఉంది.
- ఆప్ ఆవిర్భావంతో కాంగ్రెస్ సంప్రదాయ ఓటుబ్యాంకు ఆ పార్టీ వైపు మళ్లింది.

## రాజ్‌ఘాట్‌లో ప్రణబ్‌కు స్మారకం

### కేంద్రప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ: భారత మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ నేత ప్రణబ్ ముఖర్జీకి రాజధాని ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో ఉన్న రాష్ట్రీయ స్మృతి ఏరియా కాంప్లెక్స్‌లో స్మారకం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం ప్రధాని మోదీని కలిసిన ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. స్మృతి కాంప్లెక్స్‌లో తన తండ్రి సమాధిని స్మారకంగా నిర్మించడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆమె పేర్కొన్నారు.

**మన్మోహన్ సింగ్‌కు సైతం..**

మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం అంగీకరించినా..స్థలాన్ని ఇంకా ఖరారు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులను సంప్రదించాక ఆయనకూ రాష్ట్రీయ స్మృతి ఏరియా కాంప్లెక్స్‌లోనే స్మారకాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## షేక్ హసీనా పాస్‌పోర్టు రద్దు

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పాస్‌పోర్టు రద్దయ్యింది. ఆమెతోపాటు మొత్తం 97 మంది పాస్‌పోర్టులను రద్దు చేసినట్టు బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. నేరపూరిత అభియోగాలను ఎదుర్కొంటున్న వీళ్లపై తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పాస్‌పోర్టులను రద్దు చేస్తున్నట్టు బంగ్లాదేశ్ తెలిపింది. అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ షేక్ హసీనాకు అరెస్ట్ వారెంట్ జారీచేసిన మరుసటి రోజే.. బంగ్లాదేశ్ ఆమె పాస్‌పోర్టును రద్దు చేయటం గమనార్హం.

## జాహ్నవి చావుకు కారణమైన పోలీస్‌పై వేటు

న్యూఢిల్లీ, జనవరి 7: 2023 జనవరిలో అమెరికాలోని సియాటెల్‌లో భారత విద్యార్థిని జాహ్నవి కందులను తన పెట్రోలింగ్ వాహనంతో ఢీ కొట్టిన పోలీస్ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ రోజు కెవిన్ దవే ఓ డ్రగ్ బానిసను పట్టుకోవడానికి గంటకు 119 కి.మీ వేగంతో తన వాహనంలో వెళ్లారు. ఆ సమయంలో ఆయన వాహనం ఢీ కొనడం వల్ల రోడ్డు దాటుతున్న జాహ్నవి కందుల 100 మీటర్ల దూరం ఎగిరి పడి మృతి చెందారు. కెవిన్ ఉద్దేశపూర్వకంగా జాహ్నవిని ఢీకొట్టకపోయినా.. అత్యంత వేగంతో నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాలని భారత్ పట్టుబడటంతో కింగ్ కౌంటీ విచారణ చేసింది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినందుకు కెవిన్‌కు గతంలో 5 వేల డాలర్ల జరిమానా విధించింది.

## భారత్‌పోల్ పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 7: దర్యాప్తు సంస్థలకు శీఘ్రంగా అంతర్జాతీయ సహాయాన్ని అందించే ఉద్దేశంతో రూపొందించిన భారత్‌పోల్ పోర్టల్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారం భారత్ మండపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) రూపొందించిన ఈ పోర్టల్‌లో రియల్‌టైమ్ ఇంటర్‌ఫేస్ ముఖ్యమైన అంశమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సులభంగా ఇంటర్‌పోల్‌కు అనుసంధానమై తమ దర్యాప్తులను వేగవంతం చేయవచ్చని తెలిపారు. నేరాలకు పాల్పడి భారత్ నుంచి పారిపోయిన నేరస్థులను నిర్బంధించి, వారిని స్వదేశానికి రప్పించడం కోసం ఆధునిక టెక్నాలజీని, టెక్నిక్‌లను ఉపయోగించుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు.

## బర్డ్ ఫ్లూతో అమెరికాలో తొలి మరణం

వాషింగ్టన్: అమెరికాలో బర్డ్ ఫ్లూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. వైరస్ కేసులు ఉధృతంగా ఉన్న లూసియానా రాష్ట్రంలో తొలి మరణం నమోదైంది. బర్డ్ ఫ్లూ వైరస్ బారినపడ్డ 65 ఏండ్ల వ్యక్తి సోమవారం మృతి చెందాడని వైద్య అధికారులు ప్రకటించారు. గత కొద్ది రోజులుగా ఆయన శ్వాసకోశ సమస్యలతో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఇంటి వద్ద పక్షుల నుంచి ఆయనకు బర్డ్ ఫ్లూ సోకి ఉండవచ్చునని చెప్పారు. మ్యుటేషన్ చెందిన బర్డ్ ఫ్లూ వైరస్ ఆయన మృతికి కారణమైందని తెలిపారు. అమెరికాలో గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ బారినపడిన వారి సంఖ్య 66కు చేరుకుంది. వీళ్లలో చాలామంది పౌల్ట్రీ, డైరీల్లో పనిచేయటం ద్వారా వైరస్ బారినపడ్డారని వైద్యులు నిర్ధారించారు.

## 185 మంది ఉద్యోగులకు యాపిల్ ఉద్వాసన

నిధుల దుర్వినియోగం ఆరోపణలు..

**అందులో చాలామంది భారతీయులు..**

వాషింగ్టన్: టెక్ దిగ్గజ సంస్థ యాపిల్ 185 మంది ఉద్యోగులను తొలగించింది. నిధుల దుర్వినియోగం చేసి జీతాల్లో మోసాలకు పాల్పడ్డారన్న ఆరోపణపై కాలిఫోర్నియా కుపెర్టినో హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న వీరిని విధుల నుంచి తొలగించారు. వీరిలో ఆరుగురిపై కేసులు కూడా నమోదయ్యాయి. తొలగింపునకు గురైన ఉద్యోగులలో పలువురు భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు కూడా ఉన్నారు. అయితే ఉద్యోగుల తొలగింపుపై యాపిల్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉద్యోగుల్లో సామాజిక బాధ్యత పెంచేందుకు వారు లాభేతర సంస్థల సేవా కార్యక్రమాలకు సొమ్ములు విరాళంగా ఇచ్చేందుకు సంస్థ ఉద్యోగులను ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా ఉద్యోగులు ఏదైనా స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇస్తే.. యాపిల్ సంస్థ కొంత మ్యాచింగ్ గ్రాంట్ కలిపి ఆ సంస్థకు విరాళంగా ఇస్తుంది. ఇక్కడే ఉద్యోగులు అవినీతికి తెరలేపారు. వారు ఆయా సంస్థలతో చీకటి ఒప్పందం చేసుకునే వారు. దీని ప్రకారం విరాళాలు తీసుకున్న సంస్థలు ఆ ఉద్యోగులకు వారు ఇచ్చిన విరాళాన్ని వెనక్కి ఇచ్చేయడమే కాక, యాపిల్ చెల్లించిన మ్యాచింగ్ గ్రాంట్‌లో కొంత శాతం కమీషన్ ఇచ్చేవి.



## టిబెట్‌లో భారీ భూకంపం

- *126 మంది మృతి.. 188 మందికి గాయాలు*
- *రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదైన భూకంప తీవ్రత*
- *భారత్, నేపాల్‌లోనూ పలు ప్రాంతాల్లో ప్రకంపనలు*

*బీజింగ్ : టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో మంగళవారం భారీ భూకంపం సంభవించింది. ఈ దుర్ఘటనలో 126 మంది ప్రాణాలు కోల్పోగా, 188 మంది గాయపడ్డారు. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదైంది. భూకంప ప్రభావం నేపాల్, భారత్‌లలో కూడా కన్పించింది. టిబెట్‌లోని డింగ్రీ కౌంటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత అధికంగా ఉందని, దీని ధాటికి పలు భవనాలు నేలమట్టం అయ్యాయని చైనా వార్తా సంస్థ సీసీ టీవీ వెల్లడించింది. ఢిల్లీ-ఎన్సీఆర్‌తో పాటు ఉత్తర భారత్‌లోని బీహార్ రాజధాని పాట్నా, ఇతర ప్రాంతాల్లో భూకంపం ప్రభావం కన్పించింది. అస్సాం, పశ్చిమ బంగాల్‌లో కూడా భూప్రకంపనలు సంభవించాయి. టిబెట్ సరిహద్దుని ఆనుకుని ఉన్న తమ 7 జిల్లాల్లో భూకంపం వచ్చినట్టు నేపాల్ అధికారులు తెలిపారు. ప్రకంపనలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు భయంతో ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెప్పారు. హిమాలయ ప్రాంతంలో సంభవించిన భూకంపంపై టిబెట్ ఆధ్యాత్మిక వేత్త దలైలామా సంతాపం వ్యక్తం చేశారు. మారుమూల హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విధ్వంసంలో మరణించిన వారి కుటుంబాల కోసం ప్రార్థనలు చేయనున్నట్టు చెప్పారు. భూకంపం తర్వాత తమ వైపు ఉన్న ఎవరెస్ట్ పర్యాటక ప్రాంతాలను చైనా తాత్కాలికంగా మూసివేసింది. బాధిత ప్రాంతాలకు అవసరమైన సహాయాన్ని అందించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అధికారులను ఆదేశించడంతో సహాయ సామగ్రితో విపత్తు రక్షక బృందాలు టిబెట్‌కు బయలుదేరాయి.*

## కీచక తండ్రి సజీవ దహనం

- పెట్రోల్ పోసి నిప్పంటించిన మైనర్ కుమార్తెలు
- లైంగిక వేధింపులు భరించలేకే.. పాక్‌లో ఘటన

లాహోర్, జనవరి 7: కాపాడాల్సిన కంటిరెప్పే కాటేసిన విధంగా, సాక్షాత్తూ కన్న తండ్రే కీచకుడై తమపై లైంగిక దాడులకు దిగడాన్ని ఇద్దరు మైనర్ కుమార్తెలు తట్టుకోలేకపోయారు. దీంతో కన్నతండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేశారు. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని గుజ్రన్‌వాల, మొఘల్ చౌక్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తండ్రి తమపై చేస్తున్న లైంగికి దాడి భరించ లేకే విధిలేక ఈ దారుణానికి దిగినట్టు ఆ బాలికలు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం 48 ఏండ్ల అలీ అక్బర్‌కు ముగ్గురు భార్యలు. మొదటి భార్య మరణించగా, మిగిలిన ఇద్దరు భార్యలు, 10 మంది పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సోమవారం పడుకుని ఉన్న అక్బర్‌పై అతని 12, 15 ఏండ్ల కుమార్తెలు పెట్రోలు చల్లి నిప్పంటించారు. తీవ్ర గాయాలతో ఆయన దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. 'కంటికి రెప్పలా కాపాడాల్సిన నాన్నే మాపై లైంగిక దాడి చేస్తున్నాడు. ఇక మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. దీంతో విధిలేని పరిస్థితుల్లో అతడిని చంపాలని నిర్ణయించుకున్నాం. ఆయన బైక్‌లోని పెట్రోల్ తీసి చల్లి తగలబెట్టాం' అని ఆ బాలికలు పోలీసులకు తెలిపారు.

## కర్ణాటకలో విందు రాజకీయాలు

- ఇటీవల ఎస్సీ, ఎస్టీ నేతలతో సీఎం సిద్ధరామయ్య భేటీ
- డీకే శివకుమార్ విదేశాల్లో ఉండగా సమావేశం
- మరోసారి భేటీ కావాలనుకున్న ఎస్సీ, ఎస్టీ, మంత్రులు, నేతలు
- డీకే ఫిర్యాదుతో వాయిదా వేయించిన కాంగ్రెస్ అధిష్ఠానం!



బెంగళూరు, జనవరి 7: కర్ణాటక కాంగ్రెస్‌లో విందు రాజకీయాలు జోరందుకున్నాయి. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి మార్పు ఉంటుందనే ప్రచారం నేపథ్యంలో నాయకులు వర్గాలుగా విడిపోయి సమావేశాలు పెట్టుకుంటున్నారు. రాజకీయ పరిణామాలపై మంతనాలు సాగిస్తూ పైచేయి కోసం వ్యూహాలు రచిస్తున్నారు. జనవరి 2న మంత్రి సతీశ్ జార్కిహోలి నివాసంలో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల విందు జరగగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవికి ప్రధాన పోటీదారు డీకే శివకుమార్ విదేశాల్లో ఉండగా ఈ భేటీ జరగడం అనేక ఊహాగానాలకు తావిచ్చింది. ఇది కొనసాగుతుండగానే బుధవారం హోంమంత్రి పరమేశ్వర నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు విందు ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నారు.

**డీకే మంతనాలు.. విందు వాయిదా**

విదేశాల నుంచి నేరుగా ఢిల్లీ వెళ్లిన డీకే శివకుమార్ రాష్ట్రంలోని పరిణామాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపారు. ఈ ఇద్దరి సమావేశ ప్రభావం బెంగళూరులో కనిపించింది. విందు ఏర్పాటు చేయాలనుకున్న పరమేశ్వరతో రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి రణ్‌దీప్ సుర్జేవాలా సమావేశమై.. విందును వాయిదా వేసుకునేలా చేశారు. అధిష్ఠానానికి డీకే ఫిర్యాదుతోనే ఈ విందు వాయిదా పడిందనే ప్రచారం జరుగుతున్నది.

## కళ్లద్దాల కెమెరాతో అయోధ్య ఆలయ ఫొటోలు క్లిక్

### గుజరాత్ యువకుడి అరెస్ట్

అయోధ్య, జనవరి 7: అయోధ్య రామాలయ ప్రాంగణంలో కళ్లద్దాల కెమెరాలతో ఫొటోలు తీసిన గుజరాత్ యువకుడిని గుడి భద్రతా సిబ్బంది సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఆలయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అయోధ్య ఆలయంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ నిషేధం. ఈ నిబంధనను వడోదరకు చెందిన వ్యాపారి జాని జైకుమార్ ఉల్లంఘించాడు. అతడు చాలా తనిఖీ పాయింట్లను దాటుకొని ఆలయ సింహ ద్వారం వద్ద ఫొటోలు తీస్తుండగా ఎస్ఎస్ఎఫ్ జవాన్ కెమెరా ఫ్లాష్‌ను గమనించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నాడు. కళ్లద్దాలకు రెండు వైపులా కెమెరాలున్నాయని, ఫొటోలు తీయడానికి కళ్లద్దాలపై ఒక బటన్ ఉందని ఎస్పీ(సెక్యూరిటీ) బలరామ్‌చారి వెల్లడించారు.

## *బిచ్చగాడితో వెళ్లిపోయిన ఆరుగురు పిల్లల తల్లి*

### *భర్త ఫిర్యాదుతో పోలీసుల గాలింపు*

*హర్దోయి(యూపీ), జనవరి 7: ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి జిల్లాలో 36 ఏళ్ల మహిళ తన భర్తను, ఆరుగురు పిల్లలను వదిలేసి ఓ యాచకుడితో వెళ్లిపోయింది. తన భార్యను అపహరించారంటూ ఆమె భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజు భార్య దొరికిందని, అయితే నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. తన భార్య రాజేశ్వరి, ఆరుగురు పిల్లలతో కలసి తాను హర్దోయిలోని హర్పాల్‌పూర్ ప్రాంతంలో నివసిస్తున్నానని రాజు తన ఫిర్యాదులో తెలిపాడు. నన్హే పండిట్ అనే 45 ఏళ్ల యాచకుడు తరచు తమ ప్రాంతానికి భిక్షాటన కోసం వస్తుంటాడని రాజు పేర్కొన్నాడు. తన భార్య రాజేశ్వరితో మొబైల్ ఫోన్‌లో చాటింగ్ చేయడం, ఫోన్‌లో మాట్లాడడం కూడా చేస్తుంటాడని ఆయన చెప్పాడు. జనవరి 3న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కూరగాయలు కొనుగోలు చేయడానికి మార్కెట్ వెళ్లివస్తానని తన కుమార్తె కుష్బూకు చెప్పి వెళ్లిన రాజేశ్వరి సాయంత్రమైనా తిరిగి రాలేదని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గేదెను అమ్మగా వచ్చిన డబ్బును ఇంట్లో దాచానని, ఆ డబ్బు కనపడడం లేదని చెప్పాడు. తన భార్యను నన్హే పండిట్ తీసుకెళ్లి ఉంటాడని ఆయన ఫిర్యాదు చేశాడు. రాజేశ్వరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. నన్హే పండిట్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.*

## అధికారిక బంగళా నుంచి వెళ్లగొడుతున్నారు!

### కేంద్రంపై ఆతిశీ ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 7: తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలంటూ కేంద్రం తనకు నోటీసు ఇచ్చిందని ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మంగళవారం వెల్లడించారు. మూడు నెలల్లో రెండవసారి తనకు కేటాయించిన నివాసాన్ని కేంద్రం రద్దు చేసిందని ఆతిశీ తెలిపారు. తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రి అయిన రోజున బీజేపీ తన వస్తువులను రోడ్డుపై విసిరేసిందని ఆమె చెప్పారు. తన చర్యలతో బీజేపీ తమ ఆశయాన్ని అడ్డుకోలేదన్నారు. అవసరమైతే తాను ఢిల్లీ ప్రజల ఇళ్లలో తలదాచుకుని వారి కోసం పనిచేస్తానన్నారు. కాగా, అధికారిక నివాసాన్ని లాక్కున్నారంటూ ఆతిశీ చేసిన ఆరోపణను బీజేపీ ఖండించింది.

## కెనడా ప్రధాని రేసులో అనితా ఆనంద్

- ఐదుగురు పోటీదారుల్లో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు
- ప్రస్తుతం రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు



అనితా ఆనంద్

ఒట్టావా, జనవరి 7: కెనడా ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకుంటానని జస్టిన్ ట్రూడో ప్రకటించడంతో కొత్త ప్రధాని ఎన్నికకై అధికార లిబరల్ పార్టీలో కసరత్తు జరుగుతున్నది. ప్రధాని రేసులో ఐదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో ప్రధాన పోటీదారుగా అనితా ఆనంద్(57) ఉన్నారు. ప్రస్తుతం ఆమె కెనడా రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనిత తల్లిదండ్రులు భారత్ నుంచి కెనడాకు వలస వెళ్లారు. కెనడాలోని నోవా స్కోటియాలో జన్మించిన అనిత పొలిటికల్ స్టడీస్, న్యాయవిద్యను పూర్తి చేసి టొరంటో యూనివర్సిటీలో విద్యా బోధన చేశారు. 2019లో రాజకీయాల్లోకి వచ్చిన ఆమె తక్కువకాలంలోనే లిబరల్ పార్టీలో, ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2019 నుంచి ఆమె ట్రూడో క్యాబినెట్‌లో మంత్రిగా సమర్థురాలిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో ప్రధాని పదవికి ఆమె పేరును పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. భారతీయ మూలాలు కలిగిన ఎంపీ జార్జ్ చాహల్, ఉప ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్, ఆర్థికవేత్త మార్క్ కార్నే, సైతం ఈ పదవికి పోటీ పడుతున్నారు.

## తప్పుడు సమాచార వ్యాప్తి నిరోధానికి కొత్త విధానం

### కమ్యూనిటీ నోట్స్ తేనున్న మెటా

వాషింగ్టన్: తమ వేదికలపై తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించడానికి మెటా కొత్త విధానాన్ని ప్రారంభించనుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ అయిన మెటా ఇప్పటి వరకు సమాచారాన్ని ధ్రువీకరించేందుకు థర్డ్ పార్టీ ఫ్యాక్ట్ చెకర్లపై ఆధారపడేది. అయితే, వీరు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. దీంతో తప్పుడు సమాచారానికి అడ్డుకట్ట పడటం లేదు. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీ ఫ్యాక్ట్ చెకర్లను పూర్తిగా పక్కన పెట్టేయాలని మెటా నిర్ణయించింది. దీని బదులు కొత్తగా 'కమ్యూనిటీ నోట్స్' అనే ఫీచర్‌ను తీసుకురానున్నది. ఈ ఫీచర్‌తో తప్పుదోవ పట్టించే పోస్టులకు యూజర్లు వారి అభిప్రాయాన్ని రాసే అవకాశం ఉండనుంది.